క్లుప్తంగా

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం



ప్రత్యేకాలంకరణలో స్వామి, అమ్మవార్లు

పొదలకూరు: శ్రవణా నక్షత్రం సందర్భంగా పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీనివాసుని కల్యాణం కమనీయంగా జరిగింది. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ముత్యాల తలంబ్రాలను అందజేశారు. అన్నప్రసాదాలను అందించారు.

వేడుకగా మహాకుంభాభిషేకం

విడవలూరు: మండలంలోని గాదెలదిన్నె ఎస్సీ కాలనీలో చెన్నకేశవస్వామి నూతన శిలాబింబ త్రయాహ్నిక ప్రతిష్ఠ మహాకుంభాభిషేకాన్ని వేడుకగా శుక్రవారం నిర్వహించారు. విశేష పూజలను జరిపారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడారు. ఆలయ నిర్మాణానికి టీటీడీ, శ్రీవాణి ట్రస్ట్ ద్వారా అప్పట్లో రూ.పది లక్షలను మంజూరు చేయించిన మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలియజేశారు.

పొలం ఆక్రమణపై కేసు నమోదు

పొదలకూరు: పట్టణంలోని నెల్లూరు మార్గంలో ఉన్న కేఆర్‌ఆర్ గార్డెన్స్ (లేఅవుట్)కు పక్కనున్న కొంత పొలాన్ని ఆక్రమించిన కేసులో ఇద్దరు వ్యక్తులపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై ఎస్కే హనీఫ్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన ఎం.శివశంకర్, సోమా భాస్కర్ లేఅవుట్‌కు పక్కనున్న కొంత పొలం కంచెను తొలగించి కలుపుకొన్నారు. నెల్లూరుకు చెందిన పొలం యజమాని రాజ్‌కుమార్ ఫిర్యాదుతో ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాకాణి పరామర్శ



అరుణమ్మకు నివాళులర్పిస్తున్న కాకాణి

మనుబోలు: మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పల్లంరెడ్డి బాలకృష్ణారెడ్డి సతీమణి అరుణమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఆమె పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాలకృష్ణారెడ్డి, ఆయన కుమారుడు హరహరరెడ్డి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. కాకాణి వెంట నాయకులు బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, మన్నెమాల సాయిమోహన్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్ తదితరులున్నారు.

గ్రామీణ పిల్లలు.. క్రీడల్లో మెరికలు

- వివిధ పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ
- ఏడాదిలో 27 సార్లు రాష్ట్రస్థాయికి ఎంపిక
- పలువురు జాతీయ స్థాయికి..

వారంతా వివిధ గ్రామాలకు పేద పిల్లలు. క్రీడల్లో రాణించేందుకు ఎంతో కష్టపడుతున్నారు. వ్యాయామ ఉపాధ్యాయురాలి ప్రోత్సాహం లభించడంతో ఖోఖో, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ తదితర పోటీల్లో మెరిశారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.



ఖోఖో సాధన చేస్తున్న విద్యార్థినులు

వెంకటాచలం: మండలంలోని గొలగమూడిలో ఉన్న ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో 3 నుంచి 10 తరగతి వరకు 450 మంది చదువుతున్నారు. వీరంతా పేద కుటుంబాలకు చెందిన వారే. ఇక్కడ వ్యాయామ ఉపాధ్యాయురాలిగా షేక్ షబిక పనిచేస్తోంది. ఆమె విద్యార్థినులకు క్రీడల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ప్రోత్సహిస్తున్నారు. 6 నుంచి 10 తరగతి విద్యార్థులు ఖోఖో, కబడ్డీ, సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, ఫుట్‌బాల్‌పై మక్కువ పెంచుకునేలా చర్యలు తీసుకున్నారు. 13 సంవత్సరాల నుంచి విద్యార్థినులు క్రీడల్లో రాణిస్తూ పాఠశాలకు గుర్తింపు తీసుకొస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రాణించడంతో ఉన్నతాధికారులు అభినందించారు. 2024 – 25 సంవత్సరానికి సంబంధించి 27 సార్లు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై సత్తా చాటారు.

రాణించారు

పాఠశాలలో చదువుతున్న పదిమందికి పైగా విద్యార్థినులు ఇటీవల అండర్ – 14, 17 విభాగాల్లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) పోటీల్లో పాల్గొన్నారు. వ్యక్తిగత ప్రతిభ చూసి అధికారుల నుంచి మన్ననలు పొందారు. పదో తరగతి చదువుతున్న జి.హారిక, బి.విఖిత, వైష్మ, ఇలాక్షి, నాగలక్ష్మి, బి.శ్రావణి అండర్ – 17 సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, ఖోఖోలో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపారు. జి.హారిక కాకినాడలో జరిగిన అండర్ – 17 రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో బాగా ఆడి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.లక్ష్మీకామేశ్వరీదేవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు షేక్ షబిక అందిస్తున్న ప్రోత్సాహంతో వీరంతా రాణిస్తున్నారు.



శిక్షణ ఇస్తున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు షబిక



జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన హారికను అభినందిస్తున్న టీచర్లు (ఫైల్)

ఆసక్తి చూపాలి



బాలికలు చదువుతోపాటుగా క్రీడల్లోనూ ఆసక్తి చూపాలి. 15 ఏళ్లుగా పాఠశాల విద్యార్థినులకు క్రీడలపై అవగాహన కల్పిస్తూ ప్రోత్సహిస్తున్నాం. వారిలో పట్టుదల ఉండటంతో జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటుతున్నారు.

– షేక్ షబిక, వ్యాయామ ఉపాధ్యాయురాలు

ప్రోత్సాహంతోనే రాణిస్తున్నాం



పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, వ్యాయామ ఉపాధ్యాయురాలు చదువుతోపాటుగా క్రీడల్లోనూ ఆసక్తి చూపేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రయోజనాలను అర్థమయ్యేలా వివరించడంతో క్రీడల్లో పాల్గొంటున్నాం. జాతీయ స్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

– జి.హారిక, పదో తరగతి

సీనియర్ విద్యార్థులే ఆదర్శం



పాఠశాలలో మా సీనియర్లు క్రీడల్లో ప్రతిభ చూపారు. వారిలాగే నేను ఆడాలని ఆసక్తి చూపడంతో వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రోత్సహించారు. క్రీడల్లో తరచూ పాల్గొంటే ఆరోగ్యకరంగా ఉండొచ్చు. జాతీయ స్థాయిలో ప్రతిభ చూపడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

– బి.విఖిత, పదో తరగతి

కళా నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యం



ఇందుకూరుపేట: విద్యార్థుల్లో దాగి ఉన్న కళా నైపుణ్యాన్ని వెలికితీయడమే ప్రభుత్వ లక్ష్యమని పల్లిపాడులోని డైట్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. డైట్‌లో శుక్రవారం నిర్వహించిన కళా ఉత్సవ్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. కళా ఉత్సవ్‌ను ఏటా నిర్వహిస్తున్నామని వివరించారు. జిల్లాలోని ఆరు పాఠశాలలకు చెందిన 40 మంది విద్యార్థులు ఆరు విభాగాల్లో పోటీపడ్డారు. గాత్ర, సంగీత, నృత్య, దృశ్య కళలు తదితర అంశాల్లో పోటీలను నిర్వహించారు. న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు అనూష, దొరస్వామి, లక్ష్మయ్య వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. డైట్ అధ్యాపకులు నర్సింగరావు, ఎస్సీ దాస్, విజయచంద్ర, శివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రాణరక్షణ కల్పించరూ..



నిరసన తెలుపుతున్న యానాది సంఘ నేతలు

విడవలూరు: తమ ప్రాణాలకు హాని ఉందని, రక్షణ కల్పించాలంటూ పటేల్‌నగర్‌కు చెందిన చౌటూరు శ్రీనివాసులు ఆయన కుటుంబసభ్యులు స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసనను శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా యానాది మహానాడు రాష్ట్ర అధ్యక్షురాలు సావిత్రమ్మ మాట్లాడారు. విడవలూరుకు చెందిన ఇనమాల దేవకుమార్‌రెడ్డి, మరికొందరు పటేల్‌నగర్‌కు చెందిన కొందర్ని రెచ్చగొట్టి శ్రీనివాసులు కుటుంబంపై దాడులు చేయిస్తున్నారని ఆరోపించారు. ప్రశ్నిస్తే కులం పేరుతో దూషిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర జనరల్ సెక్రటరీ భాగ్యలక్ష్మి, కన్వీనర్ పూరేటి మాణిక్యరావు, యానాది సంఘ నేతలు మహేశ్వరి, ప్రమీల పాల్గొన్నారు.

రాకపోకలంటే హడల్





కోవూరు: రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నా, వాస్తవ పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. దీనికి చక్కటి ఉదాహరణగా కోవూరు మండలంలోని ఇనమడుగు నుంచి ముదివర్తి వెళ్లే రహదారి నిలుస్తోంది. ఈ రోడ్డు గుంతలమయమై ప్రమాదభరితంగా మారింది. ఇందులో వర్షపునీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు దీనిపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పాఠశాలల్లో సమావేశాలు నేడు

ముత్తుకూరు: మండలంలోని జెడ్పీ హైస్కూళ్లు, యూపీ స్కూళ్లు, ప్రాథమిక పాఠశాలల్లో శనివారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు జరుగుతాయని ఎంఈఓ మధుసూదన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 71 పాఠశాలల్లో జరిగే ఈ సమావేశాలకు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

➡ పొదలకూరు: మండలంలోని 103 ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం సమావేశాలను నిర్వహిస్తామని ఎంఈఓ కె.రేణుక శుక్రవారం తెలిపారు.

సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

- విద్యార్థులకు ఎస్పీ కృష్ణకాంత్ పిలుపు

వెంకటాచలం: విద్యార్థులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని ఎస్పీ కృష్ణకాంత్ పిలుపునిచ్చారు. మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో శుక్రవారం విద్యార్థుల ప్రవేశోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ప్రత్యేక అతిథిగా ఎస్పీ హాజరై మాట్లాడారు. ప్రతి విద్యార్థి అనుకున్న లక్ష్యంపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ఏ రంగంలోనైనా విజయం సాధించాలంటే కృషి, నిబద్ధత, సమయపాలన కచ్చితంగా పాటించాలని తెలియజేశారు. విద్యార్థి దశ చాలా కీలమైనందని, చెడు వ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గంలో ముందుకు సాగాలని చెప్పారు. ముఖ్యంగా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షతో చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలియజేశారు. చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని సూచించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన వారికి ఎస్పీ, ఇన్‌చార్జి వీసీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా గ్రామోత్సవం

పొదలకూరు: మండలంలోని మొగళ్లూరు గ్రామంలో శుక్రవారం అయ్యప్ప స్వామి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. అయ్యప్ప మాలధారణలో భక్తులు గ్రామోత్సవంలో పాల్గొని భజనలు చేశారు.



అవాస్తవాల ప్రచారాన్ని కట్టిపెడితే మంచిది

- సోమిరెడ్డికి కాకాణి హితవు

నెల్లూరు(బారకాసు): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో సర్వేపల్లి నియోజకవర్గంలో అనేక అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపిస్తున్నా, వాటిని నిరూపించలేకపోతున్నారని మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రెవెన్యూ, విజిలెన్స్ అధికారులను బెదిరించి, తప్పుడు నివేదికలు పంపాలంటూ అర్నెల్లుగా యత్నిస్తున్నారని ఆరోపించారు. ఇతరుల భూములను కాజేస్తూ, వాటికి దొంగ రిజిస్ట్రేషన్లు చేసి ఇడిమేపల్లి వద్ద ఆయన అడ్డంగా బుక్కయ్యారన్నారు. అవకతవకలు జరిగాయని అధికారులు నేటికీ నిర్ధారించలేదని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో ఏమైనా అవకతవకలు జరిగి ఉంటే, అధికారులతో విచారణ జరిపించి నిగ్గుతేల్చాలని సవాల్ విసిరారు. సోమిరెడ్డి మాట్లాడే మాటలను తాము పట్టించుకోమని పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో అత్యంత పారదర్శకంగా వేలాది ఎకరాల భూమిని పంపిణీ చేసిన ఘనత తమ పార్టీకే దక్కుతుందని చెప్పారు.

బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి



వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీలో..



పొదలకూరులో..



కొడవలూరు: గురుకులంలో..



కొడవలూరు: గౌతమ్‌నగర్‌లో..

వెంకటాచలం: మండలం కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ)లో శుక్రవారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించారు. ఇన్‌చార్జి వీసీ విజయభాస్కరరావు బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

➡ పొదలకూరు: పొదలకూరులో అంబేడ్కర్ భవన్ వద్ద శుక్రవారం కార్యక్రమం జరిగింది. మండల బహుజన సేవా సమితి అధ్యక్షుడు ఎస్వీ రత్నం బాబాసాహెబ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొప్పోలు చలపతిరావు, సుధీర్ తదితరులు పాల్గొన్నారు. విరువూరు సచివాలయంలో తహసీల్దార్ బి.శివకృష్ణ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

➡ కొడవలూరు: అణగారిన వర్గాల ఆశాదీపం అంబేడ్కర్ అని కొడవలూరు గిరిజన బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ దేవసహాయం పేర్కొన్నారు. కొడవలూరులోని గురుకులంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

➡ మండలంలోని గౌతమ్‌నగర్‌లో అంబేడ్కర్ వర్ధంతిని సర్పంచ్ నాగిరెడ్డి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ విభాగ తహసీల్దార్ కృష్ణప్రసాద్, సీపీఎం నేత గోనె దయాకర్, ఉప సర్పంచ్ నవీన్, వీఆర్వో ఏడుకొండలు, స్థానిక నేతలు ఎల్లు జనార్దన్, రమేష్, వేణు, కళాధర్, అశోక్ పాల్గొన్నారు.

➡ నార్తురాజుపాళెంలో అంబేడ్కర్ విగ్రహానికి సమతా సైనిక దళ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. దళ్ జిల్లా అధ్యక్షుడు బండి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, మండలాధ్యక్షుడు సాగర్, ఆటో యూనియన్ నేతలు మహేశ్వరరావు, విల్సన్, అంబేడ్కర్ యూత్ నేతలు సునీల్, చైతన్య, నవీన్, విజయ్‌బాబు, వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

➡ విడవలూరు: స్థానిక పీఆర్‌ఆర్ – వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ మధు తదితరులు పాల్గొన్నారు.

➡ బుచ్చిరెడ్డిపాళెం: పట్టణంలోని జొన్నవాడ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.



పొదలకూరు: నివాళులర్పిస్తున్న అధికారులు



కొడవలూరు: నార్తురాజుపాళెంలో..



విడవలూరులో..

గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

మనుబోలు: మండలంలోని మనుబోలు సచివాలయం – 1 ఆవరణలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఇందులో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. కాగా సదస్సుకు ప్రజల నుంచి పెద్దగా స్పందన లభించలేదు. నామమాత్రంగా హాజరవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. మొక్కుబడిగా సదస్సు నిర్వహించి మమ అనిపించారు. ప్రత్యేకాధికారి సుబ్బారెడ్డి, తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ జలజాక్షి పాల్గొన్నారు.

➡ పొదలకూరు: మండలంలోని విరువూరు సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి శోభన్ బాబు పర్యవేక్షణలో తహసీల్దార్ బి.శివకృష్ణ వినతిపత్రాలను స్వీకరించారు. సదస్సులో వీఆర్వో హరికృష్ణ, సర్పంచ్ జగన్‌మోహన్, మండల సర్వేయర్ గోపీ తదితరులు పాల్గొన్నారు.

➡ తోటపల్లిగూడూరు: మండలంలోని చిన్నచెరుకూరు గ్రామంలో శుక్రవారం సదస్సు జరిగింది. ఇందులో తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్, మండల ప్రత్యేకాధికారి వెంకటరెడ్డి పాల్గొని మాట్లాడారు. తహసీల్దార్ కృష్ణప్రసాద్, డీటీ శివయ్య, మండల సర్వేయర్ మహ్మద్‌బాషా, ఆర్‌ఐ ద్వారకానాథ్, వీఆర్వో సురేష్ తదితరులు పాల్గొన్నారు.

➡ ముత్తుకూరు: మండలంలోని కృష్ణపట్నం సచివాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. స్పెషల్ ఆఫీసర్, వెటర్నరీ ఏడీ డాక్టర్ శ్రీనివాస్ అర్జీలు స్వీకరించారు. డీటీ తహసీల్దార్ ప్రదీప్, ఈఓ మోహనకుమార్, ఆర్‌ఐ వెంకటేష్, డిప్యూటీ సర్వేయర్ అనురూప్, ఎంపీటీసీ సభ్యులు బొనిగి ఆనందయ్య, కోదండయ్య పాల్గొన్నారు.



టీపీగూడూరు: సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు



కోవూరు: వేగూరులో..

➡ బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని వవ్వేరులో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వినతిపత్రాలను పలువురు అందజేశారు. కాగా గ్రామంలో నివేశన స్థలాల కింద 72 మందికి పట్టాలను పంపిణీ చేశారు. వీరిలో గృహాలను నిర్మించుకునేందుకు 29 మందే అంగీకారం తెలిపారు. మిగిలిన వారు తమకు సదరు ప్రాంతంలో పట్టాలొద్దంటూ రెవెన్యూ అధికారులకు సరెండర్ చేశారు. ఈ నేపథ్యంలో పట్టాలను రెవెన్యూ శాఖ రద్దు చేయలేదు. ఈ విషయమై వినతిపత్రాన్ని లబ్ధిదారులు అందజేయగా, గృహ నిర్మాణ శాఖ పీడీ వద్దకెళ్లాలంటూ తహసీల్దార్ వెంకటేశ్వర్లు తిరస్కరించారు. మెప్మా పీడీ రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

➡ ఇందుకూరుపేట: రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలనే లక్ష్యంతో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నామని తహసీల్దార్ కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని జగదేవిపేటలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదు అర్జీలు అందాయి. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, సర్వేయర్ హరనాథ్, ఆర్‌ఐ విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



బుచ్చిరెడ్డిపాళెంలో..

➡ కోవూరు: రెవెన్యూ సదస్సులతో ఎంతో ఉపయోగమని డీపీఓ, మండల ప్రత్యేకాధికారి శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వేగూరులో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. మొత్తం 14 అర్జీలు అందాయి. తహసీల్దార్ నిర్మలానందబాబా సర్పంచ్ అమరావతి, ఆర్‌ఐ రాకేశ్, సర్వేయర్ రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఇందుకూరుపేట: జగదేవిపేటలో..



పొదలకూరులో..



ముత్తుకూరు మండలంలో..